TELTEL12349

# మన సాక్షి
గొంతుక

తెలుగు దినపత్రిక
ఎడిటర్: గుండ రాజు
చీఫ్ ఎడిటర్: చింతల మధుకృష్ణ

విలేకరులకు ఇదే మా ఆహ్వానం

అనతి కాలంలోనే విశేష ఆదరణ పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న మన సాక్షి గొంతుక తెలుగు దినపత్రిక అతి త్వరలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు చేరుయ్యేందుకు సుముహూర్తం సిద్ధమయ్యింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అనుభవం, ఆసక్తి కలిగిన విలేకరులకు ఇదే మా ఆహ్వానం.

చీఫ్ ఎడిటర్ : చింతల మధుకృష్ణ
7095686969
ఎడిటర్ : గుండ రాజు
96763 33440

RNI: TELTEL12349
మన సాక్షి గొంతుక
తెలుగు దినపత్రిక ఎడిటర్: గుండ రాజు
చీఫ్ ఎడిటర్: చింతల మధుకృష్ణ




తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : సంచిక : 51 13- 5 - 2024 సోమవారం పేజీలు : 6 వెల.4/-



# ఆవాజ్ బంద్!

## ఎలక్షన్.. వాట్ నెక్ట్స్

- రాష్ట్రమంతా సైలెంట్ మోడ్
- బహిరంగ ప్రచారానికి నో చాన్స్
- బల్క్ మెస్సేజులకు నో చాన్స్
- కొన్ని గంటల్లోనే పోలింగ్ ప్రారంభం
- అన్ని సెగ్మెంట్‌లలో భద్రత కట్టుదిట్టం
- నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో అదనపు బలగాలు
- అక్కడ సాయంత్రం నాలుగు గంటల వరకే పోలింగ్
- రహస్య శిబిరాలపై పోలీసుల డేగ కన్ను

**1,65,00,000 మంది పురుష ఓటర్లు**
**1,67,00,000 మంది మహిళా ఓటర్లు**
**కొత్త ఓటర్లు 9 లక్షలకు పైగానే**
**1,95,000 మంది పోలింగ్ సిబ్బంది**

రాష్ట్ర వ్యాప్తంగా సైలెంట్ అయిపోయింది. నిన్నటిదాకా మోత మోగిన మైకులు మౌనం పాటిం చాయి. స్పీచ్‌లతో దంచికొట్టిన లీడర్లు రెస్ట్ తీసుకుంటున్నారు. ఇక.. బహిరంగ ప్రచారానికి అవకాశం లేదని ఎలక్షన్ కమిషన్ తేల్చి చెప్పింది. రేపు (మే 13వ తేదీన) పోలిం గ్ నిర్వహణకు ఈసీ సర్వం సిద్ధం చేసింది. ఎక్కడా ఎలాంటి అవాంఛ నీయ ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. తెలంగాణలో 17 లోక్‌సభా స్థానాలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉపఎన్నికకు అంతా సిద్ధం అయ్యింది. మూడు కోట్ల 32 లక్షల మంది ఓటర్లకు 35 వేలకు పైగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు సీఈవో వికాస్ రాజ్ తెలి పారు.తెలంగాణలో ఒక కోటి 65 లక్షల మంది పురుష ఓటర్లు ఉంటే, ఒక కోటి 67 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కొత్త ఓటర్లు 9 లక్షలకు పైచిలుకు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ నిర్వహణలో 1,95,000 మంది పోలింగ్ సిబ్బంది, 160 కేంద్ర బలగాలు ఎన్నికల నిర్వహణ, భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి 20వేల మంది పోలీస్ బలగాలు ఇప్పటికే రాష్ట్రంలో మొహరించాయి. రాష్ట్రవ్యా ప్తంగా ఐదు పార్లమెంటు పరిధిలో 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనుంది.

### బల్క్ మెస్సేజులకు చెక్..

ఎన్నికల విధుల్లో 1లక్ష 90వేల మంది డైరె క్ట్ గా సిబ్బం ది పాల్గొననున్నారు. వచ్చే 48 గం టల పాటు ఏవైనా ఫిర్యాదులు వస్తే 100 నిమిషా ల్లో చర్యలు చేపడతారు. ప్రచార సమయం ముగిసింది కాబట్టి బల్క్ మెసేజ్‌లు కూడా చేయకూడదని ఈసీ హెచ్చరించింది. రాబోయే 48 గంటల పాటు రాష్ట్ర మంతటా డేగ కన్నుతో వాచ్ చేస్తున్నామని ఎవరై నా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అన్ని పార్లమెంట్ సెగ్మెంట్ లలో రిటర్నింగ్ అధికారులు హెచ్చరించారు.

### ఆ వాహనాలకు జీపీఎస్ సిస్టమ్..

ఈవీఎంలను తరలించే ప్రతి వాహనానికి జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) ఉంటుంది.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 17 లోక్‌సభ స్థానాలకు 525 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఆదివారం రాత్రి 10గంటల వరకు డోర్ టు డోర్ ప్రచారం చేసుకునేందుకు అనుమతి ఉంది. పోలింగ్ శాతం పెంచేందుకు 13వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈసీ సెలవు ప్రక టించింది. రాష్ట్ర వ్యాప్తంగా 525 మంది అభ్యర్థులు కాగా, అందులో 475మంది పురుషులు, 50 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. ఒక్క సికింద్రాబాద్ పార్లమెంట్ బరిలోనే 45 మంది అభ్యర్థులున్నారు.

### నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో..

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన అదిలాబాద్ లోక్‌సభ పరిధిలోని సిర్పూర్, ఆసిఫాబాద్, పెద్దపల్లి, చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, వరంగల్ లోక్‌సభ పరిధిలో భూపాల పల్లి.. మహబూబ్ బాద్ లోక్‌సభ పరిధిలో ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం, ఖమ్మం లోక్‌సభ పరిధిలో కొత్తగూడెం, అశ్వారావుపేటలో నాలుగు గంటలకు పోలింగ్ ముగుస్తోంది. మిగిలిన 106 స్థానాల్లో సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనుంది. రేపు సాయంత్రం లోపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది ఈవీఎంలు తరలిస్తారు.

### డేగ కళ్ల మధ్య రహస్య శిబిరాలు?

సాయంత్రం 6 గంటల వరకు ప్రచారాన్ని ముగించుకున్న వివిధ పార్టీల అభ్యర్థులు కార్యకర్తలతో రహస్య శిబిరాలను ఏర్పాటు చేసుకునేందుకు ప్లాన్‌లు సిద్ధం చేసినట్లు సమాచారం. హైదరా బాద్ జిల్లాలోని నియోజకవర్గాలకు ఒక్కో సెగ్మెంట్‌కు తొమ్మిది చొప్పున ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ టీమ్‌లను నియమించింది. ఈ బృందాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు అనుమానంగా కనిపించిన ప్రాంతాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించనున్నారు. దీంతో పాటు స్టాటిస్టికల్ సర్వైలెన్స్ టీమ్‌లు సీవిజిల్‌లో వచ్చిన ఫిర్యాదు లపై మెరుపుదాడులు నిర్వహించి బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.



### 6 గంటలూ బాధ్యతంతా అధికారులదే!

ఆదివారం ఉదయం 10 గంటల నుంచే ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూ షన్ కమ్ రిసెప్షన్ సెంటర్లలో ఈవీఎం, కంట్రోల్ యూని ట్, బ్యాలెట్ యూనిట్లతో పాటు వీవీ ప్యాట్‌ల పంపిణీ ప్రక్రియ మొదలు కానున్నట్లు అధికారులు తెలిపారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలిం గ్ స్టేషన్ వరుస సంఖ్యను బట్టి ఈ ఎలక్షన్ మెటీరియల్‌ను పంపి ణీ చేయనున్నట్లు సమాచారం. ఈ సామగ్రిని ప్రిసై డింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకే అప్పగించనున్న ట్లు వెల్లడించారు. ఈ మెటీరియల్ ను స్వాధీనం చేసు కునే సమయంలో ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకుని, మెటీరియల్ సక్రమంగా ఉందని నమ్మిన తర్వాతే స్వాధీనం చేసుకోవాలని ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారి పీఓ, ఏపీఓలకు సూచించారు. ఎలక్షన్ మెటీరియల్ స్వాధీనం చేసుకున్న సిబ్బంది పోలింగ్ ముగిసిన తర్వాత మెటీరియల్ స్ట్రాంగ్ రూమ్ లోకి వెళ్లే వరకు నిఘా నేత్రాల మధ్య డ్యూటీ చేయనున్నారు.

# స్వేచ్ఛగా ఓటేయండి

- రాష్ట్రమంతా 144 సెక్షన్ అమలు
- హైదరాబాద్‌లో ఎన్నికల సామాగ్రి పంపిణీ
- పరిశీలించిన సీఈవో వికాస్ రాజ్

తెలంగాణలో సోమవారం జరిగే లోక్‌సభ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని సీఈవో వికాస్ రాజ్ చెప్పారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కాగా, రాష్ట్రంలో 144 సెక్షన్ అమలులోకి వచ్చిందన్నారు. దీని కారణంగా నలుగురి కంటే ఎక్కువ మంది కలిసి ఉండొద్దన్నారు. 3.32కోట్ల మంది ఓటుహక్కు ఓటు వేసేలా 35,808 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం నగరంలోని యాకుత్‌పురా డీఆర్‌సీ కేంద్రాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సందర్శించారు. ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీ లించారు. పోలింగ్ సిబ్బంది ఇబ్బందులు అడిగి తెలుసుకు న్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు.



# అలెర్ట్‌గా ఉండండి..

### భారీ వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్ సమీక్ష



తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాతో పాటు పలు జిల్లాల పరిధిలో గాలి వాన, పిడుగులు పడి సంభవించిన నష్టంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు.

భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ సూచనలు ఉన్నందున జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి ఆపద వచ్చినా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోతే, రైతులు ఆందోళన చెందవద్దని అండగా ఉంటామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లోని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### పిడుగు పాటు మృతులపై సీఎం రేవంత్ విచారణ

మెదక్ జిల్లాలో పెద్ద శంకరంపేట మండలంలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందిన ఘటనపై సీఎం రేవంత్ విచారం వ్యక్తం చేశారు. చనిపోయిన ఇద్దరి కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలంలోని గిమ్మగ్రామంలో పిడుగుపాటుకు ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని, వారికి తగిన వైద్య సాయం అందేలా చూడాలని అక్కడి అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

# ఎన్నికల నేపథ్యంలో మరిన్ని ప్రత్యేక బస్సులను : సజ్జనార్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ నుంచి ఓటేసేందుకు సొంతూళ్లకు తరలివెళు ్లన్నారు. ఈ క్రమంలో సొంత గ్రామాలక వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతోపాటు, తెలంగాణలోని జిల్లాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు టీఎస్ ఆర్టీసీ ఎండీ వీ.సీ.సజ్జనార్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ వైపునకు ఇప్పటి వరకు 590 స్పెషల్ బస్సులను ఏర్పాటు చేయగా.. తాజాగా హైదరాబాద్ – విజయవాడ మార్గంలో 140 సర్వీసులను ఆన్‌లైన్‌లో ముందస్తు రిజర్వేషన్ కోసం పెట్టడం జరిగిందని, ఆయా బస్సుల్లో దాదాపు 3వేలకుపైగా సీట్లు అందుబాటులో ఉన్నాయని సజ్జనార్ తెలిపారు. విజయవాడ రూట్ వైపునకు వెళ్లే ప్రయాణికులు ప్రత్యేక సర్వీసులను వినియోగించు కోవాలని సజ్జనార్ కోరారు.

# విజయీభవా!

- జనసేనాని చిందించిన ప్రతీ చెమట బొట్టు..
- భావితరాలకు మార్గదర్శపు మెట్టు
- సోదరుడిపై కవితాత్మకంగా ట్వీట్ చేసిన నాగబాబు



జనసేనాని పవన్ కల్యాణ్ పై ఆయన సోదరుడు, మెగా హీరో నాగబాబు కవితాత్మకంగా ట్వీట్ చేశారు. పవన్ కల్యాణ్ తనను నమ్మిన వారి కోసమే కాకుండా నమ్మని వారి కోసం కూడా తపన పడుతున్నాడని చెప్పుకొచ్చారు. తన వెంట నడుస్తున్న వారితో పాటు తనకు దూరంగా ఉండే వాళ్ల గురించి కూడా ఆలోచిస్తున్నాడని సోదరుడిపై ప్రశంసల జల్లు కురి పించాడు. ఈ మేరకు ఆదివారం సోదరుడితో కలిసి ఉన్న ఫొటోను ట్వీట్ చేస్తూ.. ఇప్పుడి ప్పుడే పవన్ ఆలోచనల్లోని విశాలతను అర్థం చేసుకోవడం మొదలు పెట్టినట్లు చెప్పారు.

### సేనాని చిందించిన ప్రతి చెమట బొట్టు..

'నిన్ను నమ్మని వాళ్ల కోసం కూడా ఎందుకు నిలబడతావ్ అని అడిగితే చెట్టుని చూపిస్తాడు. అది నాటిన వాళ్లకి మాత్రమే నీడనిస్తుందా అని.. నీతో నడవని వాళ్ల కోసం కూడా ఎందుకు నిందలు మోస్తావ్ అని అడిగితే వర్షాన్ని చూపిస్తాడు. తనకి మొక్కని రైతు కంటిని తడప కుండా పంటనే తడపుతుందని.. అప్పట్నుంచి అడగటం మానేసి ఆకాశం లాంటి అతని ఆలోచనా విశాలతని అర్థం చేస్కోడం మొదలెట్టాను. సేనాని మీరు చిందించిన ప్రతి చెమట బొట్టు రేపటితరం ఎక్కబోయే మార్గదర్శపు మెట్టు కాబోతుంది కూటమి రాబోతుంది. సిరా పూసిన సామాన్యుడి వేలి సంతకంతో నీ గెలుపు సిద్ధమైంది. విజయీభవ..!' అంటూ నాగబాబు ట్వీట్ చేశారు.

# ఎన్నికల పోలింగ్ నమోదు సమాచారాన్ని సత్వరమే అందించేందుకు అవగాహన పొందాలి





మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ(మే,12):
మే 13 వ తేదీ సోమవారం నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కు సంబంధించి ఓటింగ్ నమోదు శాతాన్ని సకాలంలో పంపించేందుకు అధికారులు,డాటా నమోదు సిబ్బంది పూర్తి స్థాయిలో అవగాహన పొందాలని జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు.ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లోక్ సభ సాధారణ ఎన్నికలు-2024 సందర్భంగా మే 13వ తేదీన నిర్వహించే పోలింగ్ సమాచార నివేదికలు సకాలంలో జిల్లా కేంద్రానికి అందేలా మూడు సెగ్మెంట్లకు సంబంధించి ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశారు.98- జనగాం,99- ఘన్పూర్ స్టేషన్,100- పాలకుర్తి నియోజకవర్గంలను మూడు బృందాలుగా చేసి ఉదయం 7 గంటల నుండి నిర్వహిస్తున్న పోలింగ్ ను ప్రతి రెండు గంటలకు నివేదికలు అందించేలా శిక్షణ ఇప్పించారు.ఉదయం 9గంటలకు, 11గంటలకు,అలాగే మధ్యాహ్నం 1 గంటకు,సాయంత్రం 3 గంటలకు,5 గంటలకు సకాలంలో సమాచారం అందే విధంగా సెగ్మెంట్ల వారీగా కంప్యూటర్స్ ని ఏర్పాటు చేసి జిల్లా అధికారులను పర్యవేక్షణ నిమిత్తం నియమించారు.అధికారుల ఆధ్వర్యంలో డాటా ఆపరేటర్లను ఏర్పాటు చేసి సకాలంలో నివేదికలు పంపించేలా ఈ డిస్టిక్ మేనేజర్, ఎన్.ఐ.సీ.అధికారులతో సాంకేతికపరంగా శిక్షణ ఇప్పించారు.డాటా ఆపరేటర్లను అప్రమత్తం చేసుకోవాలని నివేదికలు సకాలంలో పంపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ అవగాహన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్,జడ్పీ సీఈవో అనిల్ కుమార్,డి.ఆర్.డి.ఓ.మొగులప్ప, ఎన్ఐసి రాంప్రసాద్,ఇడియం దుర్గారావు,మూడు నియోజకవర్గాలకు కేటాయించిన జిల్లా అధికారులు,కలెక్టరేట్ ఏవో రవీందర్ ఎలక్షన్ సెక్షన్ అధికారులు శ్రీనివాస్,శంకర్,సతీష్,డాటా సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

### హనుమాన్ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ అధ్యక్షులు సిరందాసు వెంకటేశ్వర్లు



మన సాక్షి గొంతుక మే 12
దేవరకొండ జిల్లా నల్గొండ
సామాజిక కార్యకర్త సిరం దాసు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మే -13న సోమవారం రోజున తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా సోమవారం రోజున జరగబోయే ఎన్నికల్లో మహిళలు , రాజకీయ నాయకులు , ఉద్యోగులు,యువకులు , భారత రాజ్యాంగం కల్పించిన ఓటు ఐదు సంవత్సరాల పరిపాలనలో పోలింగ్ కేంద్రంలో మీరు వేసే ఓటు ఒక్క నిమిషమైనా మన భవిష్యత్తు గురించి ఆలోచన చేసి ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ మీ ఓటును వృధా చేసుకోకుండా మీ యొక్క ఓటు ను వినియోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ సామాజిక కార్యకర్త సిరందాసు వెంకటేశ్వర్లు తెలియజేశారు.

## తెలంగాణ కీర్తిని చాటిన విద్యార్థులు







మన సాక్షి గొంతుక ప్రతినిధి బచ్చన్నపేట మండలం.
జనగామ జిల్లా బచ్చన్నపేట గోవాలో జరిగిన.6థ్ నేషనల్ ఫెడరేషన్ కప్ కొరకు తెలంగాణ నుండి సుమారు 30 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొనగా అందులో అండర్ 12- బాలికలు రజితం, అండర్ 17 బాలురు బ్రాన్జ్, అండర్ -19 బాలురు రజితం మరియు అండర్ 17 బాలికలు రజితం గెలుచుకొని తెలంగాణ కీర్తిని దేశానికి చాటారు. ఈ క్రీడలలో గుజరాత్, హర్యానా, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక, పాండిచ్చేరి మరియు తెలంగాణ విద్యార్థులు పాల్గొన్నారు.పాల్గొన్న అందరూ విద్యార్థులకు శుభాకాంక్షలు మరియు కొచ్ నసీర్ కి మేనేజర్ హేమ కి కృత్ణతలు తెలియజేసిన బాండి అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అద్యక్షులు చల్లా శ్రీనివాస్ రెడ్డి. విద్యార్థుల తల్లి దండ్రులకు కూడా మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేసి రాబోవు ఒళ్లంపిక్ మరియు ఆసియన్ గేమ్స్ లో కూడా మంచి ప్రతిభను కనపరచి తెలంగాణ ప్రతిభను మరియు కీర్తిని ఖండాంతరాలకు చాటాలని కోరారు.

## ఎన్నికల సామాగ్రి సరిచూసుకోవాలి



మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:
పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకై ఎన్నికల పోలింగ్ అధికారులు స్వీకరిస్తున్న సామాగ్రిని లిస్టు ప్రకారంగా సరిచూసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు.ఆదివారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ సామాగ్రి పంపిణీ కొరకు ఏర్పాటు చేసిన జిల్లాలోని జనగామ స్టేషన్ ఘన్పూర్ పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్ల రిసెప్షన్ సెంటర్లను ఆయా సహాయ రిటర్నింగ్ అధికారుల తో కలిసి సందర్శించి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా పంపిణీ చేస్తున్న సామాగ్రిని కలెక్టర్ సందర్శించి ప్రత్యక్షంగా పరిశీలించారు.పోలింగ్ నిర్వహించే అధికారులు సామాగ్రిని లిస్టు ప్రకారంగా పరిశీలించుకోవాలని లిస్టులో సూచించిన విధంగా ప్రతి ఒక్కటి తప్పనిసరిగా తీసుకుని వెళ్లాలన్నారు.అనంతరం పోలింగ్ అధికారులకు ఏర్పాటుచేసిన భోజన వసతిని పరిశీలించారు.వాహనాలకు జిపిఎస్ ఏర్పాటు చేయటం జరిగిందని అధికారులకు తెలియచెప్పారు.సకాలంలో ఎన్నికల పోలింగ్ సామాగ్రి స్వీకరణ అనంతరం ఏర్పాటు చేసిన వాహనాలపై పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ నిర్వహణను ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.నిర్ణీత వ్యవధిలో పోలింగ్ శాతం నివేదికల ను అందించాలన్నారు.కలెక్టర్ వెంట పాలకుర్తి, ఘన్పూర్ స్టేషన్, జనగామ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, డి.ఎస్. వెంకన్న, దేవరాయి కొమరయ్య ఎన్నికల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల పాలిట ఆపద్బాంధవుడు

# అన్నా అని పిలిస్తే పలికే నాయకుడు





## ఒక పేద ముస్లిం యువతి వివాహానికి ఆర్థిక సాయం చేసిన తీగల శివకుమార్ మాదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు

మన సాక్షి గొంతుక /శంషాబాద్
శంషాబాద్ మున్సిపాలిటీలో ఒక పేద ముస్లిం యువతి వివాహానికి తీగల శివకుమార్ మాదిరాజ్ అనే హిందూ సోదరుడు ఇరవై ఐదు వేల రూపాయలను విరాళంగా అందించాడు. శివకుమార్ మాదిరాజ్ మాట్లాడుతూ శంసాబాద్ గంగా-జుమ్నీ నాగరికతకు పుట్టినిల్లు అని, ఇక్కడ హిందువులు, ముస్లింలు కలిసి జీవిస్తున్నారని, ఒకరికొకరు సహాయం చేసుకోవాలన్నారు. ఇలాంటి సహాయాలు మరిన్ని ఉన్న నేను చేయడానికి సిద్ధంగా ఉన్నాను.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించిన శివకుమార్

### అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించిన కోడూరు శివకుమార్ గౌడ్



మన సాక్షి గొంతుక/ బచ్చన్నపేట మండలం
గత కొన్ని సంవత్సరాలుగా నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న కోడూరు శివకుమార్ మరో నిరుపేద కుటుంబానికి అండగా నిలిచారు. బచ్చన్నపేట మండలం, కొన్నే గ్రామంలో సొప్పరి నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి మనోధైర్యం చెప్పి అంత్యక్రియల గాను.5000 ఐదు వేల రూపాయలుకోడూరు శివకుమార్ గౌడ్ ఆర్థిక సాయంఅందించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కుల సంఘ పెద్దలు యాట రామచంద్రయ్య, యాట సత్తయ్య, యాటా మహేష్, కురాం కనకయ్య, కూరాం వెంకటయ్య, తేలు శ్రీనివాస్, కురాము భాస్కర్, పసుల కమలాకర్ ,పసుల రాములు తదితరులు పాల్గొన్నారు

# 12 రకాల ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపుకార్డులలో ఏదో ఒకదానితో ఓటు వేయవచ్చు







**– అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి**

**– జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:**

ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) లేకుంటే 12 రకాల ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపుకార్డులలో ఏదో ఒకదానిని చూపించి తమ ఓటు హక్కును వినియోగించుకొనే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు.ఎపిక్ కార్డు లేని వారు ఆధార్ కార్డు, ఎంజిఎన్ఆర్ఇజిఎ జాబ్ కార్డు, బ్యాంకు,పోస్ట్ ఆఫీస్ వారిచే జారీ చేసిన పాస్ పుస్తకాలు,కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య భీమా స్మార్ట్ కార్డు,డ్రైవింగ్ లైసెన్స్,పాన్ కార్డు,ఎన్పీఆర్ కింద ఆర్జీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు,పాస్ పోర్టు,ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు,పీఎస్ యూలు,పబ్లిక్ లిమిటెడ్ సంస్థల ఉద్యోగులకు ఫొటోతో జారీ చేసిన ఐడీ కార్డు,ప్రత్యేక వైకల్యం ఐడీ కార్డు (యూడీఐడీ) లలో ఏదో ఒకదానితో ఓటు వేయవచ్చని తెలిపారు.పోలింగ్ రోజు (13)న అర్హులైన ప్రతి ఓటరూ తమ ఓటును తప్పనిసరిగా వేయాలని ఆయన తెలిపారు.

**పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి......**

మే 13వ తేదీ సోమవారం నిర్వహించే పార్లమెంటు ఎన్నికల పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ తెలిపారు.ఆదివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కు చేపట్టిన ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వివరించారు.ముందుగా ఉదయం ఐదున్నర గంటలకు మాక్ పోల్ నిర్వహించడం జరుగుతుందని,అనంతరం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు.జనగామ జిల్లాలో మూడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం 14 పరిధిలోని జనగామ అదేవిధంగా వరంగల్ 15 (ఎస్సీ) నియోజకవర్గ పరిధిలో స్టేషన్ఘన్పూర్,పాలకుర్తి ఉన్నాయన్నారు.జనగామ నియోజకవర్గంలో 278 పోలింగ్ కేంద్రాలలో 2,42,771 మంది ఓటర్లు ఉండగా 1,19,491 మంది పురుషులు,1,23,270 మంది మహిళలు కాగా ఇతరులు 10 మంది ఉన్నారు.అదేవిధంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో 295 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని 2,54,110 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.అందులో 1,25,210 మంది పురుషులు,1,28,898 మంది మహిళలు కాగా ఇతరులు ఇద్దరు ఉన్నారు.పాలకుర్తిలో 296 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని,2,55,514 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.అందులో1,26,411 పురుషులు,1,29,090 మహిళల తో పాటు 13 మంది ఇతర ఓటర్లు ఉన్నట్లు తెలియజేశారు.పోలింగ్ ప్రక్రియకు 869 పోలింగ్ కేంద్రాలకు 4,132 మంది అధికారులను కేటాయించినట్లు తెలిపారు.పోలింగ్ కేంద్రానికి నలుగురు చొప్పున జనగామ నియోజకవర్గానికి 1324, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి 1396 పాలకుర్తి నియోజకవర్గం వర్గానికి 1412 పోలింగ్ అధికారులను కేటాయించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.పోలింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు ఈవీఎంల కేటాయింపులో భాగంగా జనగామ నియోజకవర్గంలో బ్యాలెట్ యూనిట్లు 1046,కంట్రోల్ యూనిట్లు 394,వివి ప్యాట్లు 395 కేటాయించగా స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గంలో బ్యాలెట్ యూనిట్లు 1120 కంట్రోల్ యూనిట్లు 418,వివి ప్యాట్లు 423, పాలకుర్తి నియోజకవర్గం లో బ్యాలెట్ యూనిట్లు 1122,కంట్రోల్ యూనిట్లు 420,వివి ప్యాట్లు 422 కేటాయించగా మూడు నియోజకవర్గాలకు కలిపి మొత్తం బ్యాలెట్ యూనిట్లు 3288,కంట్రోల్ యూనిట్లు 1232,వివి పాట్లు 1240 కేటాయించినట్లు తెలియజేశారు.మైక్రో అబ్జర్వర్ లు మొత్తం 60 రెండు మంది ఉండగా జనగామ నియోజకవర్గానికి 25 ఘనపూర్ నియోజకవర్గానికి 16 పాలకుర్తి నియోజకవర్గం 21 మందిని కేటాయించారు.జనగామ నియోజకవర్గానికి 32 రూట్లు ఉండగా 32 మంది సెక్టార్ అధికారులు ఉన్నారని అదేవిధంగా ఘన్పూర్ నియోజకవర్గానికి 35 రూట్లకుగాను 35 సెక్టార్ అధికారులు,పాలకుర్తి నియోజకవర్గం 36 రూట్లకు గాను 36 సెక్టార్ అధికారులను నియమించినట్లు చెప్పారు.



# పోలవరం ముంపు సర్వేపై ఏపీ పేచీ!

**– కేంద్ర జల్‌శక్తిశాఖ ఆదేశాలు బేఖాతర్**

**– సంయుక్త సర్వేకు ఆదేశించి ఏడాది**

**– ఇప్పటికీ స్పందించిన ఏపీ సర్కారు**

**– చోద్యం చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**

**హైదరాబాద్, మే12**

పోలవరం ప్రాజెక్టు ముంపు, బ్యాక్ వాటర్ ప్రభావం అం శాలపై ఏపీ ఆది నుంచీ మీనమేషాలు లెక్కిస్తున్నది. ముంపుపై సర్వే చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ నే, అడుగు కూడా ముందుకేయడం లేదు. సర్వే చే యిస్తామని చెప్పిన కేంద్రజల్‌శక్తి శాఖ మౌనం వహిస్తున్నది. సీజన్ ముంచుకొస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై మొద్దు నిద్రపోతున్నది. జాయింట్ సర్వే చేయించే అంశంపై అటు పీపీఏను, ఇటు కేంద్రాన్ని సంప్రదించిన దాఖలాల్లేకుండా పోయాయి. పోలవరం ప్రాజెక్టుకు ముంపుతోపాటు, అనేక సాంకేతిక అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ తెలంగాణ, ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అన్ని రాష్ట్రాలతో ఏకాభిప్రాయం సాధించాలని కోర్టు ఆదేశించింది. సీడబ్ల్యూసీ పలుమార్లు అన్ని రాష్ట్రాలతో సమావేశం నిర్వహించగా, తెలంగాణ బలమైన వాదనలు వినిపించింది.

పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణకు భారీగా ముంపు ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నది. ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్ వద్ద నీటిని నిల్వ చేసిన సందర్భంలో 891 ఎకరాలు ముంపున కు గురవుతున్నాయని, మారిన డ్యామ్ డిశ్చార్జి డిజై న్ వల్ల ముంపు పెరిగే అవకాశం ఉందని వాదించింది. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోతున్నదని, భద్రాచలం వద్ద ఊహించిన దానికంటే ఎక్కువ వర ద వచ్చిందని తెలిపింది. బ్యాక్ వాటర్ ఎఫెక్ట్ కారణంగా నదీ తీరాలు, 31 ఇతర ప్రధాన, మధ్యస్థ వా గుల వెంబడి డ్రైనేజీ రద్దీ సమస్య ఉంటుందని పేర్కొన్నది. ప్రధాన నది వరదల ప్రభావం 60 గ్రామాలపై ఉంటుందని తెలంగాణ ఆది నుంచీ డిమాండ్ చేస్తున్నది. వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సీడబ్ల్యూసీకి ఆధారాలతో విన్నవించింది. 2018, 2020, ఎన్జీటీ ఆర్డర్లకు అనుగుణంగా జరిపిన అధ్యయనం ఫలితాలను తెలంగాణ ఉటంకించింది. భద్రాచలం వరదలను కూడా ఉదహరించింది. ఎట్టకేలకు తెలంగాణ వాదనలతో కేంద్రం ఏకీభవించడంతో, జాయిం ట్ సర్వే చేపట్టాలని పీపీఏ, ఏపీ ప్రభుత్వానికి కేంద్ర జలసంఘం స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది.

## జాయింట్ సర్వేకు అనేక కొర్రీలు

పోలవరం బ్యాక్ వాటర్ ఎఫెక్ట్‌పై ఉమ్మడి సర్వే చేపట్టేందుకు ఏపీ, పీపీఏ ఆది నుంచీ తాత్సారం చేస్తున్నది. ఒకదశలో సర్వే చేసేది లేదని తేల్చి చెప్పాయి.



సీడబ్ల్యూసీ జోక్యం చేసుకుని ఏపీని సమన్వయంతో సంయుక్త సర్వే చేపట్టాలని పీపీఏకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. దీంతో అయిష్టంగానే జాయింట్ సర్వేకు పీపీఏ, ఏపీ అంగీకరించాయి. అయినా కొర్రీ లు పెడుతూ జాప్యం చేస్తున్నది. సీడబ్ల్యూసీ మరోసారి ఉమ్మడి సర్వేకు నియమిత కాలపరిమితిని విధి స్తూ పీపీఏకు అల్టీమేటం జారీ చేసింది. తొలుత తెలంగాణ, ఏపీలతో సమావేశం నిర్వహించి, ఉమ్మడి సర్వే ను చేపట్టాలని నొక్కిచెప్పింది. ఏపీ సహకరించకపోయినా సర్వే బాధ్యత పీపీఏదేనని తేల్చిచెప్పి ఏడాది గడిచింది. సీడబ్ల్యూసీ అల్టీమేటంతో పీపీఏ, ఏపీ కొంత హడావుడి చేసి జాయింట్ సర్వేకు ప్రత్యేక అధికార బృందాన్ని నియమించాయి. సర్వేకు తేదీలను తెలియజేయాలని తెలంగాణకు సమాచారం అందించాయి. తీరా సర్వే చేసేందుకు వచ్చిన ఏపీ మళ్లీ పేచీ పెట్టింది. తెలంగాణ డిమాండ్ల మేరకు సర్వే చేయడం కుదరదని, పోలవరం ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్ 150 అ డుగల మేరకు నీటినిల్వ వల్ల గతంలో బూర్గంపాడు వరకు తేల్చిన ముంపు వరకే సర్వే చేస్తామని కొర్రీ పెట్టి సర్వే నిలుపుదల చేసింది. సీడబ్ల్యూసీ సూచన మేరకు సర్వే కుదరదని, ఒకవేళ అదే చేస్తే జాతీయ ప్రాజెక్టుపై తీవ్ర ప్రభావం పడుతుందని వితండ వాదానికి తెరలేపి సర్వేను అటకెక్కించింది.

## చోద్యం చూస్తున్న కేంద్రం

పోలవరం ముంపుపై సర్వేకు ఏపీ ఆది నుంచీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నది. కేంద్రం ఆదేశాల ను అమలు చేయడంలో పీపీఏ కూడాప్రేక్షకపాత్రనే పోషిస్తున్నది. ఇదే విషయమై బీఆర్ఎస్ ప్రభుత్వం పీపీఏకు అనేక సార్లు లేఖలు రాసినా స్పందన లేదు. పీపీఏ నిర్లక్ష్యం, ఏపీ కాలయాపన, జాయింట్ సర్వే ఆదేశాలను బేఖాతర్ చేస్తున్న తీరుపై కేంద్రానికి ఫిర్యా దు చేసింది. అయినా కేంద్రం ఎలాంటి చర్య లు తీసుకోకుండా కేవలం లేఖలు రాస్తూ చేతులు దులుపుకుంటున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఈ విషయంపై దృష్టి సారించిన దాఖలాలు కూడా లేవు. మరోవైపు సీజన్ సమీపిస్తున్నందున ఇప్పటికైనా సర్వేకు ఏపీపై ఒత్తిడి తీసుకురావాలని తెలంగాణ ఇంజినీర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# గత ముఖ్యమంత్రి వల్ల ఒరిగిందేమీ లేదు...

**– నియోజకవర్గ ప్రజల కోసమే మా మార్పు కాపుల నాగరాజ్**

**– బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్ లో చేరిక**

**చర్ల, మే 12, మన సాక్షి గొంతుక:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నియోజకవర్గం లో ఎప్పుడు ఎన్నికలు జరిగినా రాష్ట్రంలో ఒక పార్టీ ఉంటే భద్రాచలం నియోజకవర్గం లో మరో పార్టీ గెలుస్తుందని, గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉన్న కాపుల నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా చర్ల స్వేచ్ఛ ప్రెస్ క్లబ్ లో పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతిసారి రాష్ట్రంలో ఒక పార్టీ ఉంటే భద్రాచలంలో మరో పార్టీ రావడం వల్ల భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోవట్లేదని, ప్రజలకు మంచి చేయడానికి తప్పనిసరి పార్టీ మారవలసి వచ్చిందని, బీఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. నన్ను నమ్ముకున్న వారికి న్యాయం జరగాలంటే అధికార పార్టీ అండదండలు ఉండాలని, పది సంవత్సరాల నుండి బీఆర్ఎస్ పార్టీలో ఉండి పార్టీ అభివృద్ధికి కృషిచేశానన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ తెల్లం వెంకట్రావు నియోజకవర్గం అభివృద్ధికోసమే పార్టీ మారారని ఆయనతో కలిసి ప్రజలకు సేవచేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని గిరిజన నాయకుడు కాపుల నాగరాజు అన్నారు. మరికొందరు మండలంలోని సీనియర్ నాయకులు పార్టీ మారవచ్చానన్నారు. మన ఎమ్మెల్యే వెంకట్రావు నాయకత్వంలో ప్రజలకు సేవచేస్తానని మన ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తానని కాపుల నాగరాజు పత్రికా సమావేశంలో తెలిపారు.




సార్వత్రిక సమరంలో నాలుగో దశ చివరి అంకంలో భాగంగా రేపు ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు ఈసీ ఏర్పాట్లు పూర్తి చేసింది. 25 పార్లమెంటు నియోజకవర్గాలకు 454 మంది, 175 అసెంబ్లీ స్థానాలకు 2వేల 387 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా 4 కోట్ల 14 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందుకోసం 46వేల 389 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన EC మెజారిటీ నియోజకర్గాల్లో వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తోంది. ఎలాంటి హింసకు తావులేకుండా ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. సార్వత్రిక ఎన్నికలు నాలుగో విడతలో భాగంగా..ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 13న పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 25 లోక్‌సభ స్థానాలు, 175 శాసనసభ నియోజకవర్గాల్లో పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఈ నెల 13 ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ నిర్వహిస్తారు.

# ఏపీలో రేపే పోలింగ్

## 25 లోక్ సభ... 175 అసెంబ్లీ స్థానాలకూ

- లోక్‌సభ బరిలో 454 మంది, అసెంబ్లీకి 2387 మంది పోటీ
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 4 కోట్ల 14 లక్షల మంది
- 46 వేల 389 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- ఎన్నికల బరిలో జగన్, చంద్రబాబు, పవన్, షర్మిల, పురందేశ్వరి..
- ప్రముఖులు సుజనా చౌదరీ, రఘురామకృష్ణ రాజు, సీఎం రమేష్, కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు



### మోడల్ పోలింగ్ కేంద్రాలు

రాష్ట్రవ్యాప్తంగా 28 చోట్ల మోడల్ పోలింగ్ కేంద్రాలను కూడా...ఏర్పాటు చేసింది.పోలింగ్ కేంద్రాల్లో విధుల కోసం 3 లక్షల 30 వేల మంది సిబ్బంది, లక్షా 14 వేల మంది పోలీసు సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉంటారు. 10 వేల మంది సెక్టార్ అధికారులు,18వేల 961 మంది మైక్రో అబ్జర్వర్లు, బ్లాక్ లెవల్ అధికారులు 46వేల 165 మంది విధుల్లో ఉంటారని తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా.. 34వేల 165 పోలింగ్ కేంద్రాల్లో... వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తారు. మాచర్ల సహా 14 నియోజకవర్గాల్లో వందశాతం వెబ్‌క్యాస్టింగ్ నిర్వహించనున్నారు.ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లుచేసినట్లు ఏపీ ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్ కుమార్ మీనా వివరించారు. గతంలో తిరుపతి ఉపఎన్నికల సందర్భంగా వేరే ప్రాంతం వారు వచ్చి ఓట్లు వేసిన ఘటనలు జరగకుండా చూస్తామని ముకేశ్ కుమార్ స్పష్టం చేశారు.

### అరకు, పాడేరు, రంపచోడవరంలో నాలుగు గంటల వరకే పోలింగ్

169 నియోజకవర్గాల్లో సాయంత్రం 6 గంటల వరకూ, అరకు, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటల వరకూ, పాలకొండ, కురుపాం, సాలూరు నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ జరగనుంది. లోక్‌సభ స్థానాలకు 454 మంది, శాసనసభ నియోజకవర్గాలకు 2వేల 387 మంది బరిలో ఉన్నారు. లోక్‌సభ స్థానాలకు సంబంధించి విశాఖలో అత్యధికంగా 33 మంది, నంద్యాల్లో 31 మంది, గుంటూరులో 30 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అత్యల్పంగా రాజమహేంద్రవరంలో 12 మంది పోటీ చేస్తున్నారు. శాసనసభ స్థానాల్లో అత్యధికంగా తిరుపతిలో 46 మంది, అత్యల్పంగా చోడవరంలో ఆరు గురు పోటీలో నిలిచారు.రాష్ట్రవ్యాప్తంగా 4 కోట్ల 14 లక్షల 18 వందల 87 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఇందుకోసం 46వేల 389 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. వేసవి దృష్ట్యా అన్ని పోలింగ్ కేంద్రాల్లో టెంట్లు వేయటం సహా తాగునీటి సదుపాయం, ప్రాథమిక చికిత్సకు మెడికల్ కిట్లు....అందుబాటులో ఉంచనుంది. దివ్యాంగులు...., వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

### ఎన్నికల బరిలో ముఖ్యమంత్రి, ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు

ఏపీలో ఏకకాలంలో ఇటు లోక్ సభకు, అటు అసెంబ్లీకి పోలింగ్ జరగనుంది.. ఈ ఎన్నికలలో ఒక ముఖ్యమంత్రితో పాటు ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు, 11 మంది మంత్రులు, 28మందికి పైగా మాజీ మంత్రులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.. మరోసారి రాష్ట్రంలో అధికారం చేపట్టాలని వైసిపి, ఈసారి విజయం సాధించాలని టిటిపి కూటమి ఆరాటపడుతున్నాయి.. ఇక పులివెందుల అసెంబ్లీ బరిలో ముఖ్యమంత్రి జగన్ , కుప్పం నుంచి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, పిఠాపురం నుంచి పవన్ కల్యాణ్ ను బరిలో ఉన్నారు.. లోక్ సభ విషయానికొస్తే రాజంపేట నుంచి ఉమ్మడి ఎపి మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.. బిజెపి రాష్ట్ర చీఫ్ పురందేశ్వరి, ఎపీ పిసిపి బాస్ షర్మిల కడప నుంచి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అనకాపల్లిలో సిఎం రమేష్ బిజెపి అభ్యర్థిగా రంగంలో ఉన్నారు.విజయవాడ వెస్ట్ సిఎం రమేష్, నగరిలో రోజా, పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చీపురుపల్లిలో మంత్రి బోత్స, ఉండి రఘురామకృష్ణం రాజు, మంగళగిరిలో నారా లోకేష్‌బాబు పోటీలో ఉన్నారు.

# పేదలకు కరెంటు ఫ్రీ

- 200 యూనిట్ల దాకా ఇస్తాం
- కూటమి అధికారంలోకి వస్తే మరింత సంక్షేమం
- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రకటన



విపక్ష ఇండియా కూటమి అధికారంలోకి వస్తే దేశంలో పేదలందరికీ 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందచేస్తామని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. తమ పది గ్యారంటీల్లో మొదటి గ్యారంటీ దేశవ్యాప్తంగా 24గంటల విద్యుత్ సరఫరాయేనని వివరించారు. దేశంలో 3 లక్షల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా మనం కేవలం 2 లక్షల మెగావాట్ల విద్యుత్‌నే ఉపయోగించుకుంటున్నామని కేజ్రీవాల్ చెప్పారు. దేశమంతటా పేదలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తామని, ఇందుకు రూ. 1.25లక్షల కోట్ల వ్యయమవుతుందని, ఈ నిధులను తాము సర్దుబాటు చేస్తామని కేజ్రీవాల్ చెప్పుకొచ్చారు. కాగా, ప్రధాని మోదీ 75 ఏండ్ల తర్వాత రిటైర్ అయితే ఆయన స్థానంలో తదుపరి ప్రధాని ఎవరని కేజ్రీవాల్లేవనెత్తినప్రశ్నపై హాట్ డిబేట్ సాగుతోంది. 75 ఏండ్ల తర్వాత కూడా మోదీనే ప్రధానిగా కొనసాగుతారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల వివరణ ఇచ్చారు.

# ఇనుపరాడ్డుతో కొట్టి చంపేశాడు

- బెట్టింగ్‌లో ₹2 కోట్లు పోగొట్టడంతో ఆగ్రహం
- కొడుకు చేష్టలకు తట్టుకోలేకపోయిన ఓ తండ్రి
- మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలంలో ఘటన
- బెట్టింగ్, జల్సాలతో ఇల్లు, ఫ్లాట్ అమ్మేసిన కొడుకు

బెట్టింగ్ యాప్‌ల బారినపడి ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోంది. బెట్టింగ్ ఉచ్చులో చిక్కుకుని అందినకాడికి అప్పులు చేసి ఆపై చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. బెట్టింగ్‌కు బానిసై రూ. 2 కోట్లు పోగొట్టుకున్న కుమారుడిని ఓ తండ్రి నిర్దాక్షిణ్యంగా కొట్టి చంపాడు. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలంలో ఈ ఘటన జరిగింది.

### హెచ్చరించినా వినిపించుకోలేదు..

బగిరాత్‌పల్లికి చెందిన ముకేశ్ కుమార్ (28) బెట్టింగ్, జల్సాలకు అలవాటు పడ్డాడు. విషయం తెలిసిన తండ్రి హెచ్చరించినా పట్టించుకోలేదు. బెట్టింగ్ మాయలో పడి రూ. 2 కోట్ల వరకు పోగొట్టాడు. ఎన్నిసార్లు చెప్పినా తన ప్రవర్తన మార్చుకోకపోవడంతో గత రాత్రి ముకేశ్‌పై తండ్రి ఇనుప రాడ్డుతో దాడిచేశాడు. రాడ్డు తలపై బలంగా తగలడంతో ముకేశ్ మరణించారు. రైల్వే ఉద్యోగి అయిన ముకేశ్ బెట్టింగ్‌కు బానిసై ఇల్లు, ఫ్లాటు అమ్మేసినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ముకేశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# విశాఖలో నగదు పట్టివేత

- కారులో డబ్బులు తరలింపు
- సీ విజిల్‌కు వచ్చిన ఫిర్యాదు
- పోలీసుల తనిఖీల్లో రూ.కోటిన్నర స్వాధీనం
- పరారీలో నిందితులు..
- గాలింపు చేపట్టిన త్రీ టౌన్ పోలీసులు

విశాఖలో డిస్ట్రిక్ ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు చేపట్టిన తనిఖీలో భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ. కోటిన్నర నగదును కారులో తరలిస్తున్నట్లు సీ విజిల్ కు వచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. వెంటనే విశాఖలోని బీచ్ కు సమీపంలో గల పాండురంగపురంలో తనిఖీలు చేపట్టగా రూ.కోటిన్నర నగదు పోలీసులు పట్టుకున్నారు. నిందితులు పరారీలో ఉన్నారు. నిన్న నార్త్ లో ఇన్ కంటాక్స్ రూ.7 కోట్లకు పైగా.. నేడు తాజాగా కోటిన్నర నగదు సీజ్ చేయడం జరిగింది. త్రి టౌన్ పోలీసులకు డ్రిస్టిక్ ఫ్లైయింగ్ స్కాడ్ అధికారులు నగదును అప్పగించారు. త్రీటౌన్ సీఐ పార్థసారథి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారైన నిందితుల కోసం గాలింపు చేపట్టారు.



# గ్రాడ్యుయేషన్ ట్రిప్.. విషాదాంతం

### - స్కూల్ బస్సుకు ప్రమాదం - 11 మంది మృతి

ఇండొనేషియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గ్రాడ్యుయేషన్ ట్రిప్‌కు విద్యార్థులను తీసుకెళ్తున్న స్కూల్ బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో సుమారు 11 మంది ప్రాణాలు కోల్పోయారు. 60 మందికిపైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రాడ్యుయేషన్ ట్రిప్‌కు జావా ద్వీప పట్టణం నుంచి ప్రముఖ పర్యాటక ప్రదేశమైన లెంబాంగ్‌కు బయల్దేరారు. వీరు ప్రయాణిస్తున్న బస్సు శనివారం సాయంత్రం 6:48 గంటలకు ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి ఓ కారును, మూడు ద్విచక్ర వాహనాలను బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో తొమ్మిది మంది విద్యార్థులు కాగా, ఒక ఉపాధ్యాయుడు, ద్విచక్ర వాహనదారుడు ఉన్నట్లు జావా ప్రావిన్స్ పోలీసు ప్రతినిధి జూల్స్ అబ్రహం అబాస్ట్ తెలిపారు. ఈ ఘటనలో సుమారు 13 మందికి తీవ్ర గాయాలైనట్లు చెప్పారు. మరో 40 మందికి స్వల్ప గాయాలైనట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అదుపుతప్పిన బైక్

### ఇద్దరు యువకుల మృతి

విశాఖపట్నంలో శనివారం రాత్రి ఘోర ప్రమాదం జరిగింది. ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై ఓ బైక్ అదుపుతప్పి ఫ్లైఓవర్ గోడను ఢీ కొట్టింది. ఆ వేగానికి బైక్‌పై ఉన్న ముగ్గురు యువకులు ఫ్లైఓవర్ పైనుంచి కింద పడ్డారు. తీవ్ర గాయాలతో ఇద్దరు యువకులు స్పాట్ లోనే చనిపోగా.. మూడో యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సీసీటీవీ కెమెరా ఫుటేజీలో బైక్ ఒకటి వేగంగా దూసుకురావడం కనిపిస్తోంది. టర్నింగ్ లోనూ అదే వేగంతో వెళ్లడంతో బైక్ అదుపుతప్పి వాల్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్ అక్కడే పడిపోగా.. యువకులు మాత్రం ఫ్లైఓవర్ నుంచి కిందపడ్డారు. పై నుంచి పడడంతో యువకులు ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. రక్తస్రావంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మరణించారు. ప్రమాద విషయం తెలిసి అక్కడికి చేరుకున్న పోలీసులు మూడో యువకుడిని స్థానిక ఆసుపత్రికి తరలించారు.

### సోషల్ మీడియాలో వీడియో వైరల్

సీసీటీవీ ఫుటేజీ బయటకు రావడంతో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. కాగా, ఈ ప్రమాదంలో చనిపోయిన యువకులను తనవరపు కుమార్, అరవెల్లి పవన్ కుమార్ గా గుర్తించినట్లు పోలీసులు వివరించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# సైలెన్స్ పీరియడ్‌లో ప్రచారం..

## కాంగ్రెస్ పార్టీపై ఈసీకి బీఆర్ఎస్ ఫిర్యాదు

కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ నేతలు ఈసీకి ఫిర్యాదు చేశారు. తెలంగాణలో శనివారం సాయంత్రం 6 గంటలకే ఎన్నికల ప్రచార గడువు ముగిసింది. అయితే గడువు పూర్తయిన తరువాత సైతం కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీపై సీఈవో వికాస్ రాజ్ కు ఫిర్యాదు చేశారు.

సోమవారం (మే 13న) ఉదయం పోలింగ్ ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో సైతం కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తోందని బీఆర్ఎస్ నేతలు ఈసీకి ఫిర్యాదు చేశారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ లో ఎలాంటి ప్రచారం నిర్వహించరాదు అనే ఎలక్షన్ కమిషన్ నిబంధనల్ని కాంగ్రెస్ పార్టీ ఉల్లంఘించినట్లు తమ ఫిర్యాదులో బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.

టీపీసీసీ సైతం సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తోందని అందుకు తగిన ఆధారాలను సమర్పించారు. ఈసీ ఇచ్చిన గడువు ముగిసినా ప్రచారం చేయడంపై చర్యలు తీసుకోవాలని ఈసీతోపాటు తెలంగాణ సీఈవో వికాస్ రాజ్ కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది.




# ఫోర్త్ ఫేజ్‌కు అంతా రెడీ

- 10 రాష్ట్రాలు.. 96 లోక్‌సభ స్థానాలకు పోలింగ్
- ఏపీలోని 175 అసెంబ్లీ స్థానాలకూ ఓటింగ్
- ఎన్నికల బరిలో నిలిచిన మహామహులు

**పోలింగ్‌కు సర్వం సిద్ధం**

**సార్వత్రిక సమరం నాలుగోదశ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఈ విడతలో 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని 96 నియోజకవర్గాల్లో రేపు పోలింగ్ జరగనుంది. నక్సల్స్, ఏజెన్సీ ప్రాంతాల్లో పోలింగ్ నాలుగు గంటలకే ముగియనుండగా, మిగిలిన ప్రాంతాల్లో సాయంత్రం ఆరు గంటల వరకు జరగనుంది. ఇందుకోసం ఎన్నికలసంఘం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. ఈ దశలో ప్రధాన రాజకీయ పక్షాలతో కలిపి మొత్తం 1,717మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పోలింగ్ ఏర్పాట్ల కోసం సిబ్బంది ఇప్పడిప్పడే మెటీరియల్ కలెక్షన్ కేంద్రాల నుంచి వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకుంటున్నారు.**



### ఏపీలో అసెంబ్లీకి

ఆంధ్రప్రదేశ్‌లో 25, తెలంగాణ 17, ఉత్తర ప్రదేశ్ 13, మహారాష్ట్ర 11, మధ్యప్రదేశ్, పశ్చిమ బంగాల్‌లో 8చొప్పున, బీహార్ 5, ఒడిశా, ఝార్ఖండ్‌లో 4 చొప్పున, జమ్ముకశ్మీర్‌లో ఒక లోక్‌సభ నియోజకవర్గంలో పోలింగ్ జరగనుంది. ఈ విడతలోనే ఆంధ్రప్రదేశ్‌లోని 175 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఒడిశాలో 147 అసెంబ్లీ నియోజకవర్గాలకు నాలుగువిడతల్లో ఓటింగ్ జరగనుంది. ఈనెల 13న జరిగే తొలివిడతలో 28స్థానాలకు, ఈనెల 20న జరిగే రెండో విడతలో 35, ఈనెల 25న 42, జూన్ 1న 42శాసనసభ స్థానాలకు ఓటింగ్ జరగనుంది. నాలుగో విడతలో భాగంగా బీహార్‌లో దర్భంగా, ఉజియార్‌పూర్, సమస్తిపూర్, బెగుసరాయ్, ముంగేర్ నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది. జమ్ముకశ్మీర్‌లో శ్రీనగర్, ఝార్ఖండ్‌లోని సింఘ్‌భూమ్, ఖూంటి, లోహర్దగ, పాలాము స్థానాల్లో ఓటింగ్ నిర్వహించనున్నారు. మధ్యప్రదేశ్‌లో దేవాస్, ఉజ్జయిని, మందసౌర్, రత్లాం, ధార్, ఇండోర్, ఖర్గోన్, ఖాండ్వా లోక్‌సభ స్థానాలకు ఓటింగ్ జరగనుంది.

### మహారాష్ట్రలో..

మహారాష్ట్రలో నందుర్బార్, జల్గావ్, రావెర్, జల్నా, ఔరంగాబాద్, మావల్, పుణె, షిరూర్, అహ్మద్‌నగర్, షిర్డీ, బీడ్‌లో కూడా పోలింగ్ జరగనుంది. ఒడిశాలో నబరంగ్‌పుర్, బెర్హంపుర్, కోరాపుట్, కలహండిలో ఓటింగ్ నిర్వహించనున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో షాజహాన్‌పుర్, ఖేరీ, ధౌరాహ్రా, సీతాపుర్, హర్దోయి, మిస్రిఖ్, ఉన్నావ్, ఫరూఖాబాద్, ఇటావా, కన్నౌజ్, కాన్పూర్, అక్బర్‌పూర్, బహ్రైచ్‌లో పోలింగ్ జరగనుంది. పశ్చిమబంగాల్‌లో బహరంపుర్, కృష్ణానగర్, రణఘాట్, బర్ధమాన్ పుర్బా, బుర్ద్వాన్‌దుర్గాపుర్, అసన్సోల్, బోల్పూర్, బీర్భూమ్‌లో ఓటింగ్ నిర్వహించనున్నారు.

### ఎన్నికల బరిలో ప్రముఖులు

నాలుగో విడత జరగనున్న 96 లోక్‌సభ నియోజకవర్గాల పోలింగ్‌లో పలువురు ప్రముఖులు బరిలో నిలిచారు. నాలుగోదశలో కేంద్రమంత్రులు గిరిరాజ్‌సింగ్, అర్జున్ ముండా, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధీర్‌రంజన్ చౌధరీ, తృణమూల్ నేత మహువా మొయిత్రా సహా పలువురు ప్రముఖులు బరిలో ఉన్నారు. బిహార్‌లో అత్యంత కీలక నియోజకవర్గాల్లో ఒకటైన బెగుసరాయ్ నుంచి కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అదేస్థానం నుంచి భాజపా తరపున మళ్లీ బరిలో నిలిచారు. బెగుసరాయ్‌ని బిహార్ మినీ మాస్కోగా పిలుస్తారు. ఇక్కడ భూమిహార్ వర్గీయుల ప్రాబల్యం ఎక్కువగా ఉంటుంది. గిరిరాజ్‌సింగ్‌సహా ఇప్పటివరకు అక్కడ నుంచి గెలిచిన ఎంపీల్లో అత్యధికులు ఆవర్గంవారే. 2019 ఎన్నికల్లో...సీపీఐ అభ్యర్థి కన్నయ్య కుమార్‌పై గిరిరాజ్ 4.2లక్షల ఓట్ల తేడాతో గెలుపొందారు. 86శాతం హిందూ జనాభా కలిగిన బెగుసరాయ్...ఎన్డీయేకు కంచుకోటగా ఉంది. అందుకే గిరిరాజ్ సింగ్ ఈసారి కూడా విజయంపై ధీమాతో ఉన్నారు.

### విపక్షనేత అధీర్ రంజన్‌కు అగ్నిపరీక్ష

పశ్చిమ బంగాల్‌లో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్‌లు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ముర్షిదాబాద్ జిల్లాలోని బహరంపుర్ లోక్‌సభ స్థానం అందరిదృష్టిని ఆకర్షిస్తోంది. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌధరి 1999 నుంచి బహరంపుర్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈసారి అధీర్ రంజన్‌కు పోటీగా మాజీ క్రికెటర్ యూసఫ్ పఠాన్‌ను టీఎంసీ బరిలోకి దింపింది. గుజరాత్‌కు చెందిన యూసఫ్ పఠాన్ అన్ని రకాల క్రికెట్ ఫార్మాట్ల నుంచి 2021లోనే రిటైరయ్యారు. బహరంపుర్‌లో ఐదు సార్లు ఎంపీగా నెగ్గిన అధీర్...ఈసారి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. నిరుద్యోగం, కార్మికుల వలసలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. బీజేపీ నుంచి నిర్మల్ చంద్ర సాహ పోటీ చేస్తున్నారు. ప్రముఖ వైద్యుడిగా ఆయనకు పేరుంది.

### లసన్ ఫోల్‌లో బాలీవుడ్ నటుడు శత్రుఘ్న సిన్హా..

బాలీవుడ్‌లో బిహారీబాబుగా గుర్తింపు పొందిన కేంద్ర మాజీమంత్రి శత్రుఘ్న సిన్హా... పశ్చిమ బంగాల్‌లోని అసన్సోల్ నుంచి టీఎంసీ తరఫున రెండోసారి బరిలో నిలిచారు. ఇక్కడ దాదాపు 50శాతం మంది బెంగాలీయేతరులే ఉన్నారు. అందులో అత్యధికులు బిహారీలు కావటం శత్రుఘ్నసిన్హాకు కలిసి వచ్చే అంశంగా మారింది. అందుకే 2022 ఉపఎన్నికల వేళ టీఎంసీ వ్యూహాత్మకంగా ఆయనకు టికెట్ ఇచ్చింది. అప్పుడు విజయం సాధించిన సిన్హా...మళ్లీ బరిలో దిగారు. ఆయన్ను బయటివ్యక్తిగా ప్రచారం చేస్తున్న బీజేపీ...స్థానికంగా సర్దార్ జీగా సుపరిచితుడైన కేంద్ర మాజీమంత్రి సురేంద్రజీత్‌సింగ్ అహ్లూవాలియాకు టికెట్ ఇచ్చింది. స్థానికుడికి, స్థానికేతరుడికి మధ్య పోరుగా ఈ ఎన్నిక మారింది. ఇక్కడ సీపీఎం కూడా పోటీ చేస్తున్నప్పటికీ...ప్రధానంగా సిన్హా, సర్దార్‌జీ మధ్యే నువ్వానేనా అన్నట్లు పరిస్థితి తయారైంది. తాగునీటి కొరత, నిరుద్యోగం అంశాలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి.

### కన్నోఫ్ఙ్ బరిలో అఖిలేష్ యాదవ్

సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఉత్తర్‌ప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ ప్రస్తుతం కన్నౌజ్ నుంచి బరిలో నిలిచారు. తొలుత ఆర్జెడీ అధ్యక్షుడు లాలుప్రసాద్ యాదవ్ అల్లుడు తేజ్‌ప్రతాప్ యాదవ్‌ను అభ్యర్థిగా ప్రకటించిన ఎస్పీ...తర్వాత మనసు మార్చుకుని అఖిలేశ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. 2000, 2004, 2009 ఎన్నికల్లో కన్నౌజ్ నుంచి అఖిలేష్ ఎంపీగా గెలుపొందారు. 2012లో సీఎం పగ్గాలు చేపట్టాక ఆయన రాజీనామా చేశారు. అప్పుడు జరిగిన ఉపఎన్నికలో ఆయన సతీమణి డింపుల్ యాదవ్ ఏకగ్రీవంగా గెలుపొందారు. 2014లోనూ రెండోసారి గెలిచిన ఆమె... 2019 ఎన్నికల్లో భాజపా అభ్యర్థి సుబ్రత్ పాఠక్ చేతిలో ఓడిపోయారు. డింపుల్ ఈసారి మైన్‌పురి నుంచి బరిలో నిలిచారు. మరోసారి సిటింగ్ ఎంపీ సుబ్రత్ పాఠక్‌కు బీజేపీ టికెట్ కేటాయించింది. అయిదేళ్లక్రితం తన సతీమణి డింపుల్‌ను ఓడించిన సుబ్రత్‌పై బదులు తీర్చుకోవాలని అఖిలేశ్ బరిలో నిలిచారు.



## ఫేక్ ప్రచారాలు నమ్మొద్దు

### టీడీపీ అధినేత చంద్రబాబు



వైసీపీ ప్రభుత్వంపై టీడీపి అధినేత చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటమి అంచుల్లో ఉన్నా వైసీపీకి బుద్ధి రాలేదని, ఇంకా ఫేక్ వీడియోలు, ఆడియోలు పోస్టులు పెడుతూ జనాన్ని మోసం చేయాలనే చూస్తున్నారని ఆయన అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు డీప్ ఫేక్ ఆడియోలు, ఫేక్ లెటర్లు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజలెవరూ ఈ ఫేక్ ప్రచారాలను నమ్మొద్దని, కుట్రలతో తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై పోలీసులు, ఎన్నికల అధికారులు తక్షణం కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఓటేయకపోతే ఆస్ట్రేలియాలో ఫైన్




ఆస్ట్రేలియాలో ఎన్నికలు చాలా సరదాగా జరుగుతాయి. అయినా.. ఓటు వేయడానికి మొండికేసే వారిపై కొరడా కూడా ఝుళిపిస్తోంది. తొలుత వారికి నోటీస్ పంపిస్తుంది. దానికి సరైన కారణం తెలియజేస్తూ కచ్చితంగా ఓటరు జవాబు ఇవ్వాల్సిందే. సరైన కారణం లేకపోతే ఆయా ప్రావిన్స్‌లను బట్టి 20 డాలర్ల వరకు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. పలు మార్లు నోటీసులు పంపినా ఫైన్ చెల్లించకపోతే కోర్టు జైలు శిక్ష లేదా కమ్యూనిటీ సర్వీస్ విధించే అవకాశం ఉంది.

## ఆటవిడుపు

### ఫుట్‌బాల్ ఆడిన సీఎం రేవంత్

ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసిపోయింది. కొద్ది నెలలుగా ప్రచారంలో రోజుకు పలు ప్రాంతాలు తిరుగుతూ క్షణం తీరిక లేకుండా గడిపిన రాజకీయ నాయకులు కాస్త ఊరట పొందుతున్నారు. వీరిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ సెంట్రల్ యూవర్సిటీలో సరదాగా ఫుట్ బాల్ ఆడారు. ఆట మధ్యలో షూ పాడైపోతే షూ లేకుండనే సీఎం ఫుట్ బాల్ ఆడారు. సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, పలువురు లీడర్లున్నారు. టీఎంఆర్ఐఈఎస్ ప్రెసిడెంట్ ఫహీం ఖురేషి, హెచ్‌సీయూ ఎన్ ఎస్‌యూఐ యూనిట్, హెచ్ సీయూ విద్యార్థులు తదితరులు సీఎంతో పాటు ఫుట్ బాల్ ఆడారు. ఈ ఫుట్ బాల్ మ్యాచ్ కి సీఎం సలహాదారుడు వేంనరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు హర్కర్ వేణుగోపాల్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఏం ఏ ఫహీం, టీ శాట్ సీఈఓ వేణుగోపాల్ రెడ్డి ఇతరులు కూడా హాజరయ్యారు. హెచ్‌సీయూ ఎన్ ఎస్‌యూఐ యూనిట్, ఎన్ ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్, ఇన్‌చార్జి అజయ్ నేతృత్వంలో ఈ మ్యాచ్ నిర్వహించారు.








# ఆమె మాయలో

మమితా బైజు

సౌత్‌లో ప్రెజంట్ ట్రెండింగ్‌లో ఉన్న భామ మమితా బైజు. ప్రేమలు సినిమాతో ఆమె యూత్‌కు ఫేవరెట్ హీరోయిన్ అయిపోయింది. గిరీష్ డైరెక్షన్ లో తెరకెక్కిన ప్రేమలు సినిమా ఫస్ట్ మలయాళంలో రిలీజై సూపర్ హిట్ కాగా ఆ తర్వాత ఆ మూవీని తెలుగు, తమిళ భాషల్లో డబ్ చేశారు. ప్రేమలు డబ్బింగ్ వెర్షన్ కూడా సూపర్ హిట్ అవ్వడంతో సౌత్ ఆడియన్స్ అంతా కూడా రీను అలియాస్ మమితా బైజు మాయలో పడిపోయారు. దాదాపు ఏడేళ్లుగా మలయాళంలో సినిమాలు చేస్తూ వస్తున్న మమితాకు ప్రేమలు సినిమాతో బ్రేక్ వచ్చిందని చెప్పొచ్చు. అంతకుముందు అమ్మడు చేసిన సినిమా మమితా బైజులతో కూడా మంచి పాపులారిటీ సంపాదించిన అది కేవలం మలయాళ పరిశ్రమ వరకే ఉండేది. కానీ ప్రేమలు సినిమా మమితాను సౌత్ ఆడియన్స్ కు కొత్తగా పరిచయం చేసింది. సినిమా చూసిన తర్వాత ఎవరైనా ఆమె ప్రేమలో పడిపోయేలా చేసింది.

ప్రేమలు సినిమాకు యువతలో ఉన్న ఈ బజ్‌ని దృష్టిలో ఉంచుకునే గిరీష్ ప్రేమలు 2 ని ప్లాన్ చేశారు. ప్రేమలు సూపర్ హిట్ అవ్వడమే ఆలస్యం వెంటనే కథ రాసి ప్రేమలు 2 ని సెట్స్ మీదకు తీసుకెళ్లారు. ఇక సౌత్ లో తనకు వచ్చిన ఈ క్రేజ్ ని ఎంజాయ్ చేస్తున్న మమితా బైజు సినిమాలతోనే కాకుండా ఫొటో షూట్స్ తో కూడా అలరిస్తుంది. తన మార్క్ ఫొటో షూట్స్ తో ఫాలోవర్స్ ని మెప్పిస్తుంది అమ్మడు. లేటెస్ట్ గా ప్రింటెడ్ రెడ్ కలర్ శారీ వైట్ బ్లౌజ్ తలలో మల్లెపూలు.. అచ్చ తెలుగు అమ్మాయిలా మమితాను అలా చూస్తూ ఉండిపోవాలనిపించేలా ఉంది.. మమితా అదరగొట్టేసింది. రీను గా ప్రేక్షకులకు తనను తానుగా కొత్తగా పరిచయం చేసుకున్న మమితా తన నటనతో ప్రేక్షకుల హృదయాలను కొల్లగొడుతుంది.



# ఫ్యాషన్ ఐకాన్.. ఉర్ఫీ

బాలీవుడ్ బ్యూటీ, బిగ్ బాస్ ఫేమ్ ఉర్ఫీ జావెద్ కు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. సోషల్ మీడియాలో ఫుల్ పాపులర్ అయిన ఈ బ్యూటీ ఫోటోలు ఎప్పుడూ ట్రెండ్ అవుతూనే ఉంటాయి. వెరైటీ వెరైటీ కాస్ట్యూమ్స్ తో దిగిన పిక్స్ తోపాటు వీడియోలను షేర్ చేసుకుంటూ పాపులారిటీ పెంచుకుంటోంది. తన డ్రెస్సింగ్ కు ప్రశంసలతో పాటు అనేక విమర్శలు కూడా ఎదుర్కొంటోంది. కానీ వాటిని పట్టించుకోకుండా దూసుకుపోతుంటోందిబ .. ప్రస్తుత ఫ్యాషన్ వరల్డ్ లో ఆమె ఒక స్పెషల్ ఐకాన్. మారుతున్న ఫ్యాషన్ ప్రపంచానికి అనుగుణంగా కొత్త కొత్త ట్రెండీ డ్రెస్సులు వేసుకుంటూ సెగలు పుట్టిస్తుంటోంది. కుర్రాళ్ళ గుండెల్లో అగ్గి రాజేస్తుంటోంది. మూవీ ఈవెంట్స్, టీవీ షోస్, అవార్డు ఫంక్షన్లకు స్పెషల్ డ్రెస్సులు వేసుకుని వస్తుంటుంది. అక్కడ స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తుంటోంది. కెమెరాల ఫోకస్ అంతా ఆమె డ్రెస్ పైనే ఉంటుంది. అంతలా ఆమె డ్రెస్సింగ్ స్టైల్ కు ఫ్యాన్స్ ఉన్నారు. తాజాగా కొత్త పిక్స్ షేర్ చేసింది ఉర్ఫీ. మూడే మూడు ముక్కల బ్లూ కలర్ స్విమ్ డ్రెస్ వేసుకుని ఓ రేంజ్ లో స్కిన్ షో చేసింది. ప్రస్తుతం వెకేషన్ లో ఉన్న ఉర్ఫీ.. గులాబీ పువ్వుల ఎమోజీలను క్యాప్షన్ గా ఇచ్చింది. స్విమ్మింగ్ పూల్ లో స్నానం చేసి బయటకు వస్తున్న వీడియోతో పాటు పిక్స్ షేర్ చేసింది. ఒక్కసారిగా తన అందాలు చూపిస్తూ మైండ్ బ్లాక్ చేసింది.

Urfi Javed



# అదా.. రూటే వేరబ్బా!

దేశమంతా సంచలనం సృష్టించిన ది కేరళ స్టోరీ కథానాయిక అదా శర్మ కెరీర్ అయిపోయింది అనుకున్న ప్రతి సారి మళ్లీ రెట్టింపు ఉత్సాహంతో సినిమాలు చేస్తుంది. ది కేరళ స్టోరీ తో అదా శర్మ నెక్స్ట్ లెవెల్ క్రేజ్ తెచ్చుకుంది. కెరీర్ లో మొదటి నుంచి రిస్క్ తీసుకోవడంలో ముందుంటుంది అదా శర్మ. బాలీవుడ్ లో 1920 సినిమాతో తొలి ప్రయత్నం చేసింది. అమ్మడు చేసిన ఈ సినిమా వల్లే ఆమెకు తెలుగులో పూరీ జగన్నాథ్ హార్ట్ ఎటాక్ ఆఫర్ వచ్చింది. నితిన్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమాలో అదా శర్మ మెప్పించింది. ఐతే సినిమా కమర్షియల్ గా వర్క్ అవుట్ కాకపోవడంతో అమ్మడికి పెద్దగా అవకాశాలు రాలేదు. మెగా ఫ్యామిలీ నుంచి పిఠాపురం మిస్సైంది వీళ్లిద్దరే! తొలి సినిమా 1920 తర్వాత కన్నడలో పునీత్ రాజ్ కుమార్ తో రణ విక్రం సినిమా చేసింది అదా శర్మ. అదా శర్మ ముందు జిమ్నాస్టిక్స్ నేర్చుకోవాలని అనుకంది. అది చేస్తున్న టైం లోనే అమ్మడికి నటన మీద ఆసక్తి పెరగడంతో సినిమాల్లోకి వచ్చింది. అదా శర్మ డ్యాన్స్ లో కూడా ట్రైనింగ్ తీసుకుంది. ఆమె చిన్నప్పటి నుంచి క్లాసికల్ డ్యాన్స్ నేర్చుకుంది. జిమ్నాస్టిక్స్ లో కూడా ప్రావీణ్యం పొందింది. అందుకే యాక్షన్ సినిమాల్లో కూడా తాను నటించేందుకు రెడీ అంటుంది. అదా శర్మ మంచి యానిమల్ లార్. స్ట్రీట్ డాగ్స్ ని దత్తత తీసుకోవాలని ఆమె చెబుతుంది. కెరీర్ పరంగా తనను కాదన్న వారే మళ్లీ అవకాశాలు ఇచ్చేలా చేసుకుంది అదా శర్మ. కోవిడ్ లాక్ డౌన్ టైం లో తన వెరైటీ వీడియోస్ తో అందరినీ అలరించిన అదా శర్మ. వరుస విజయాలతో తన సత్తా చాటుతుంది. అదా శర్మతో ప్రయోగాలు చేసేందుకు సిద్ధం అంటున్నారు మేకర్స్. తెలుగులో ఆమె చిన్న చిన్న పాత్రల్లో కూడా చేస్తూ వచ్చింది. అయితే కెరీర్ ముందుకు సాగాలంటే కొన్నిసార్లు వచ్చిన ఏ చిన్న అవకాశాన్ని వదులుకోకూడదని ఆమె అలా చేసిందని చెప్పొచ్చు. కేరళ స్టోరీ తర్వాత మాత్రం అదా తో సినిమా అంటే అంచనాలు భారీగా ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం అమ్మడు రెండు సినిమాలతో బిజీగా ఉంది.

# నభా నటేష్ రీ ఎంట్రీ..



గ్లామర్ హీరోయిన్ గా తనదైన అందం, ఆకర్షణతో అవకాశాలు పెంచుకుంటున్న భామ నభా నటేష్. నన్ను దోచుకుందువటే సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ ఇస్మార్ట్ శంకర్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ సొంతం చేసుకుంది. తరువాత వరుసగా అవకాశాలు అందుకుంటూ వచ్చింది. అయితే ఆమె కెరియర్ లో ఇస్మార్ట్ శంకర్ మాత్రమే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. నభా నటేష్ చివరిగా మ్యాస్ట్రో మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. తరువాత రోడ్డు ప్రమాదానికి గురికావడంతో రెండేళ్ల పాటు సినిమాలకి దూరమైంది. మరల గత కొంతకాలంలో హాట్ ఫోటోషూట్ లతో సోషల్ మీడియాలో యాక్టివ్ అయ్యింది. ఇదిలా ఉంటే ఈ అమ్మడు తాజాగా ఇన్ స్టాగ్రామ్ లో మరోసారి హాట్ ఫోటోలని షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలలో నభా నటేష్ బ్లాక్ కలర్ లాంగ్ ఫ్రాక్ తో అద్దం ముందు నిలబడి వయ్యారంగా ఫోజులు ఇస్తోంది. అద్దంలో నభా అందాల ప్రతిబింబం కుర్రాళ్ళకి కునుకు లేకుండా చేసేలా ఉందనే మాట వినిపిస్తోంది.

# తెలుగు తెరపై.. మరో కేరళకుట్టి



తెలుగు తెరపై మలయాళీ భామల జోరు సాగుతోంది. ఆల్రెడీ ఇక్కడ చక్రం తిప్పుతున్న హీరోయిన్స్ లో మలయాళ భామలు ఉన్నారు. ఇంతకుముందు ఇక్కడి ఆడియన్స్ ను ప్రభావితం చేసిన బ్యూటీలు .. ప్రస్తుతం తెలుగు తెరపైకి వస్తున్న అందగత్తెలు మలయాళ ఇండస్ట్రీకి చెందినవారు కావడం విశేషం. అలా ఇప్పుడు మలయాళం నుంచి మరో బ్యూటీ టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది .. ఆ బ్యూటీ పేరే 'అధీరా రాజ్'. సత్యదేవ్ హీరోగా 'కృష్ణమ్మ' సినిమా రూపొందింది. సరైన విడుదల తేదీ కోసం చాలా కాలంగా ఎదురుచూస్తూ వచ్చిన ఈ సినిమా, శుక్రవారం థియేటర్లకు వచ్చింది. ఈ సినిమా ద్వారానే ఇక్కడి ప్రేక్షకులకు 'అధీరా రాజ్' పరిచయమైంది. తాజా ఫొటో షూట్ నుంచి వదిలిన లేటెస్ట్ పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. చక్కని మేనిఛాయ .. ఆకర్షణీయమైన రూపం .. విశాలమైన కళ్లు ఆమెకి మరింత అందాన్ని తెచ్చిపెడుతున్నాయి. వైట్ అండ్ ఎల్లో కలర్ శారీలో ఆమె అందం రెట్టింపు అవుతోంది. కుదురైన రూపంతో కుందనపు బొమ్మలా కనిపిస్తున్న అధీరా, ఇక్కడి తెరపై కుదురుకునేలానే ఉంది. చూడాలి మరి యంగ్ హీరోల తదుపరి సినిమాలలో ఆమె బిజీ అవుతుందేమో.